# నిత్యానందం ఆఫీసు నుండి హడావిడిగా వస్తూ భార్యతో " ఏమేవ్! సీతా! రేపు ఆదివారం మా బాస్‌ను, ఆయన భార్యను భోజనానికి పిలిచాను. చాలా బాగా వంట చెయ్యాలి" అన్నాడు.

అర్థం కానట్టు చూసింది అర్ధాంగి.

"అదేనే, ఆయనకు డైరక్టర్‌గా ప్రమోషన్ వచ్చి వెళ్ళిపోతున్నాడు వచ్చేవారం. మా జాతకాలన్నీ ఆయన గుప్పిట్లో వుంటాయి ఇంక. ఆయన్ను కాకా పడితే ప్రమోషన్ లిస్టులో వున్న నాకు తొందరగా ప్రమోషన్ వచ్చేట్లు చూస్తాడు. అందుకే బాగా వంట చేసి మెప్పించాలి మరి!" అన్నాడు.

"అలాగే" అంది సీత.

బాస్ ఇంటి కెళ్ళి పతిసమేతంగా రమ్మని ఆహ్వానించాడు. ముందు మొహమాటపడ్డా, తరువాత ఒప్పుకున్నాడాయన.

ఆదివారంనాడు ఇంట్లో నిత్యానందం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. సీత కూడా మహా కష్టపడి పులుసులూ, కారాలు బాగా దట్టించి ఘుమఘుమలాడే వంటకాలు చేసింది- పులిహోర, గారెలు, బంగాళా దుంపల కూర, నిమ్మకాయ కారం, మైసూర్‌పాక్, పాయసం వగైరాలు. పిల్లలుంటే బాస్ విసుక్కుంటాడేమో అని నిత్యానందం వాళ్ళని సినిమాకి పంపేసాడు. ఇల్లంతా బాగా సర్ది, డైనింగ్ టేబిల్ మీద చేసిన పదార్థాలన్నీ చక్కగా అమర్చాడు.

భార్యా సమేతంగా వచ్చిన బాస్‌ని సాదరంగా ఆహ్వానించాడు. వాళ్ళు కూచున్నాక సీత తీసికొచ్చింది పళ్లెంలో జంతికలూ, మైసూర్‌పాక్. తినమంటే ఇబ్బందిగా మొహం పెట్టి ఓ జంతికముక్క నోట్లో వేసుకు నమలలేక చప్పరిస్తూ కూర్చున్నాడా పెద్దమనిషి.

"పెద్దవాళ్ళం కదా ఇలాంటి గట్టి పదార్థాలు ఎలా నములుతాం?" అని ఆవిడంది.

చాలా బాధ పడిపోయేడు నిత్యానందం.

మళ్ళీ ఆవిడే అంది, "పిల్లల్లేరా ఇంట్లో?"

"పక్కవాళ్ళతో సినిమా కెళ్ళారు" అన్నది సీత.

"అయ్యో! పిల్లలతో కాలక్షేపం చెయ్యొచ్చనుకున్నాం" అంది ఆవిడ.

ఇంకా భోజనాల దగ్గిర కూర్చున్నారు. వాళ్ళేం తినడం లేదు. నిత్యానందానికి వాళ్ళు బాగా తినకుండా తనూ, సీతా సుష్టుగా తినడం ఇబ్బందిగా వుంది. వంటకాలన్నీ చాలా బాగా కుదిరాయి. 'మరి వాళ్ళు తినరేం?' అనుకున్నాడు. ఇంక కంగారుపడి, "సర్! సర్! ఏంటి మీరు తినడం లేదు? మీ కోసం...మీకు ఇష్టమని పులుసులూ, కారాలు బాగా వేయించి చేయించాను పదార్థాలు. ఈ పులిహోర... ఈ గారెలు... ఈ నిమ్మకాయ కారం బాగులేదాండి?"

"బాగానే వున్నాయి ఘుమఘుమలాడుతూ" అన్నాడాయన.

"మరి తినండి సర్" అన్నాడు.

"ఎలా తినను? బాగాలేంది నాకే! పులుపూ, కారం పడదు. మానేసాను" అన్నాడాయన.

ఎసిడిటీ అని అర్థం చేసుకుని "పోనీ ఈ బంగాళా దుంపల కూర తినండి. పులుపూ కారం ఎక్కువ లేదు" అన్నాడు.

## భోజన ప్రభావం




గాస్ ట్రబుల్‌తో బాధపడుతున్న బాస్ "బంగాళా దుంపలు రాత్రిపూట తిననయ్యా. నాకు అరగవు" అన్నాడు బాధగా.

"పోనీ మీరు తినండమ్మా" అన్నది సీత.

"నాకు బి.పి. నాయనా! ఉప్పూ- కారాలు తింటే ఇంకేమైనా వుందా? అన్నీ మానేసి చప్పిడి తిండి తింటున్నాం" అంది బాస్‌కి బాస్.

"పోనీ ఈ మైసూర్‌పాక్ ముక్క తినండి, లేకపోతే ఈ పాయసం తీసుకోండి" అంది సీత.

"తీపి పడదు బాబూ నాకు! అందుకే ఎవరిళ్ళకు భోజనాలకు వెళ్ళం తొందరగా" అసంతృప్తి ధ్వనించింది అందులో.

వీళ్ళిద్దరికీ బి.పి, ఎసిడిటీ, గాస్ ట్రబుల్, సుగర్ వుందని తెలిసి నిత్యానందం తనను తానే తిట్టుకున్నాడు. భోజనాలయ్యాక వాళ్ళు వెళుతుంటే ఓ గాజు గ్లాసుల సెట్ ఇచ్చాడు గుర్తుగా వుంచమని. "ఎందుకూ? మా ఇంట్లో చాలా వున్నాయ్" అని మర్యాదగానే వద్దని వెళ్ళారు.

మర్నాడు ఆఫీసులో స్నేహితుడు సత్యమూర్తితో చెప్పుకు బావురుమన్నాడు నిత్యానందం.

సత్యమూర్తి మరుసటి ఆదివారం బాస్‌ను సతీ సమేతంగా పిలిచాడు భోజనానికి. సత్యమూర్తి మాటల చాతుర్యంతో ఎవరినన్నా ఆకట్టుకోగలడు. ఇద్దరు పిల్లలకీ మంచి మేనర్స్ నేర్పాడు. భార్యా సమేతుడై బాస్ రాగానే ఇద్దరు కొడుకులూ "నమస్కారం" అన్నారు. అది చూసి ఆఫీసర్ భార్య మహా ముచ్చటపడి "ఎంత మంచి పిల్లలో!" అని మెచ్చేసుకుంది. వాళ్ళ కబుర్లు వింటూ కాలక్షేపం చేశారు.

భోజనం దగ్గర కొసరి కొసరి వడ్డించారు సత్యమూర్తి, అతని భార్య కమల. "సర్! మీకు మా వంటలు నచ్చుతాయో లేదో తెలీదండీ. మేం పులుపూ కారం తినం ఎక్కువగా- మాకు పడవు!" అన్నాడు సత్యమూర్తి. "మాకూ పడవోయ్. అందుకని మేం కూడా తక్కువ గానే వేసుకుంటాము - అదీ ఎప్పుడైనా. సాధారణంగా తినం. కాని చాలా బాగున్నాయి అన్నీను. ఈ కాబేజీ కూర చాలా బాగుందే పనసపొట్టు కూరలా! ఎలా చేశావమ్మా ఇంత రుచిగా?" అన్నాడాయన. "కొద్దిగా ఆవపెట్టి - అంటే సువాసనకని...కారం అదీ పెద్దగా వెయ్యలేదు..." అంది కమల.

"ఈ పెరుగు పచ్చడి చాలా బాగుందమ్మా!" అందావిడ. "ఇంకొంచెం వేసుకోండి. ఈ కొబ్బరి పెరుగు పచ్చడిలో పోపూ, కొంచెం కొత్తిమీర వేసానంతే. ఇంకేం వేయలేదు" అంది. "అవునమ్మా! చాలా బాగుంది నీ వంట" మెచ్చేసుకుందావిడ. "ఈ కాజాలు తినరూ! గోధుమ పిండితో చేసినవే. మేం శనగ పిండితో ఏమీ చేసుకుతినం. పడవు!" అంది కమల. కొసరి కొసరి తినిపించారు. భోజనం చాలా బాగుందన్నారు బాస్, ఆయన భార్యామణీ.

భోజనాలయ్యాక ఓ పెద్ద ప్లేట్లో చిన్న గాజు పాత్రల్లో పెట్టిన ఫ్రూట్ సాలడ్ వుంచింది వాళ్ళ ముందు కమల. "ఇంకా ఏంటి? అసలే కడుపులో చోటు లేదు- ఇంకేం పెట్టకండి!" అంటూనే నెమ్మదిగా ఫ్రూట్ సాలడ్ తిని కొంతసేపు కబుర్లు చెప్పుకు లేచారు వెళ్తామని.

వెళ్తాంటే "చిరుకానుక" అంటూ కమల చిన్న వెండి కుందుల జత బొట్టుపెట్టి తాంబూలంతో ఇచ్చింది ఆవిడకి గుర్తుగా వుంచమని. ఆవిడ చాలా సంతోషించింది పూజలోకి పనికి వస్తాయని. హైదరాబాదు వస్తే తమ ఇంటికి తప్పక రావాలని మరీ మరీ చెప్పి కదిలారు దంపతులిద్దరూ.

నెల రోజులు పోయాక నిత్యానందం విచారవదనంతో వచ్చాడు ఆఫీసు నుండి ఓ రోజు. అడిగిన భార్యతో ఇలా అన్నాడు, "చూసావే సీతా! ఆ సత్యమూర్తికి సీనియర్‌ని నేను - అతని కొచ్చింది ప్రమోషన్ ముందుగా!"

సానుభూతిగా చూసింది సీత.